క్లుప్తంగా

శరన్నవరాత్రులకు ముస్తాబు


అలంకరణలో లక్ష్మీచెన్నకేశవస్వామి

ధర్మవరం అర్బన్: దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. 9 రోజుల పాటు జరిగే నవ రాత్రి ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. ధర్మవరం పట్టణంలోని ఆలయాల్లో స్వాముల మూలవిరాట్‌లు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. శనివారం శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి, గాయత్రిదేవి ఆలయంతో పాటు పలు ఆలయాల్లో స్వాములకు ప్రత్యేక పూజలు చేశారు.

నేటి నుంచి ప్రత్యేక కార్యక్రమాలు

బత్తలపల్లి: స్థానిక శ్రీలలితా త్రిపుర సుందరీ సమేతా ఓంకారేశ్వరుని ఆలయంలో శరన్నవ రాత్రులను పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త, ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్య ప్రకాష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు కోటి సుధ తెలిపారు. ఆదివారం దుర్గాదేవికి స్వర్ణకవచాలంకరణ, 16న శ్రీబాలత్రిపుర సుందరీదేవి అలంకరణ, 17న శ్రీగాయత్రిదేవి, 18న శ్రీలలితా త్రిపుర సుందరీదేవి, 19న అన్నపూర్ణదేవి, 20న మహాలక్ష్మీదేవి, 21న సరస్వతిదేవి, 22న దుర్గాదేవి, 23న మహిషాసుర మర్ధిని, 24న రాజరాజేశ్వరీదేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిస్తారన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

తనకల్లు: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను శనివారం పోలీసులు సీజ్ చేశారు. ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపిన ప్రకారం.. సీజీ ప్రాజెక్టు నుంచి ఎంసీ తండాకు ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేశారు.

పరిహారం అందజేత

కదిరి అర్బన్: మండల పరిధిలోని గంగన్నగారిపల్లి వద్ద జగనన్న కాలనీ స్థలంలో వరిమడి వేసుకుని జీవనం సాగిస్తున్న రైతు నాగరాజుకు శనివారం రూ.40 వేల పంటనష్ట పరిహారాన్ని ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి సమక్షంలో అందజేశారు. రూ.20 వేలు ఎమ్మెల్యే, రూ.20 వేలు గ్రామ సర్పంచ్ శాంతాబాయ్ కుమారుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మణికంఠనాయక్ అందించారు. నాగరాజు కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లింగాల మధుసూదన్‌రెడ్డితో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

సుందర భవనం.. సేవలకు సిద్ధం!


ఓబుళంపల్లిలో రూ.35 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం


రూ.21.8 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం


రూ.17.5 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్

చెన్నేకొత్తపల్లి: మండలంలోని ఓబుళంపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ భవనాలు ప్రారంభోత్సవానికి సిద్ధమయ్యాయి. ఓబుళంపల్లిలో రూ.35 లక్షలతో గ్రామ సచివాలయ భవనం, రూ.21.8 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.17.5 లక్షలతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్లను నిర్మించారు. ఈ భవనాలను ఈ నెల 18న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు ఎంపీపీ అంజలి, జెడ్పీటీసీ గోవిందరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నర్సిరెడ్డి తెలిపారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటా


సత్యనారాయణ రెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి

కొత్తచెరువు: అధైర్య పడొద్దు.. అండగా ఉంటానని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి భరోసా ఇచ్చారు. మండల పరిధిలోని ఎర్రబల్లి గ్రామంలో సీనియర్ వైఎస్సార్ సీపీ నేత, రిటైర్డ్ టీచర్ సత్యనారాయణ రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి శనివారం గ్రామానికి వెళ్లి సత్యనారాయణ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ కోసం సత్యనారాయణ రెడ్డి చేసిన సేవలను కొనియాడారు. అదే గ్రామంలో చెన్నకృష్ణ కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం భర్త నాగరాజును కోల్పోయిన వలంటీర్ జోత్స్నను, ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు నాగేశ్వర్ రెడ్డి తండ్రి నరసింహా రెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకొని వారి ఇంటికి వెళ్లి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నారేపల్లి జగన్మోహన్ రెడ్డి, ఎంపీపీ భర్త రెడ్డప్పరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు తిప్పారెడ్డి, మండల కో ఆప్షన్ మెంబర్ మున్వర్ బాషా, చక్కీరప్ప, భాస్కర్, నంజిరెడ్డి, శంకర్ రెడ్డి, తదితరులున్నారు.

పరామర్శ

పుట్టపర్తి టౌన్: బుక్కపట్నంకు చెందిన ముస్కీన్ వళి గురువారం భవనంపై నుంచి ప్రమాదవశాత్తూ పడి మృతి చెందారు. అలాగే, బుక్కపట్నంకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త వన్నూరప్ప తండ్రి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి శనివారం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. బుక్కపట్నంకు చెందిన కోఆప్షన్ సభ్యులు యాసఫ్ తండ్రి షమీవుల్లా ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద చికిత్స పొందుతున్న విషయం తెలుసుకొన్న ఎమ్మెల్యే.. వారి ఇంటి వద్దకు వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, కేశప్ప, మండల అగ్రిబోర్డు చైర్మన్ వెంకటచౌదరి, డీలర్ నాగభూషణ, నాయకులు పతంజలి, నారాయణస్వామి, మునాఫ్, ఖారద్‌బాయ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహాలయ అమావాస్య


పోట్లమర్రి వద్ద పూజలు నిర్వహిస్తున్న ప్రజలు

బత్తలపల్లి: మండలంలో శనివారం పితృపక్ష మహాలయ అమావాస్యను ఘనంగా నిర్వహించారు. తల్లిదండ్రులకు, వారి వారి కుటుంబీకులకు సమాధుల వద్ద పూజలు నిర్వహించారు. ఇష్టమైన ఆహార పదార్థాలు ఉంచి పూజలు చేశారు.

ప్రశాంతంగా జీవించండి

బత్తలపల్లి: కక్షలు వీడి ప్రశాంతంగా కలిసిమెలిసి జీవించాలని బత్తలపల్లి ఎస్‌ఐ పి.శ్రీనివాసులు అన్నారు. శనివారం మండలంలోని గరిశలపల్లి, ఉప్పర్లపల్లి గ్రామలలో ఆయన పర్యటించారు. గ్రామసభ ఏర్పాటు చేసి ప్రజలకు సూచనలు ఇచ్చారు. అనవసర విషయాలలోకి తలదూర్చి సమస్యలు కొని తెచ్చుకోవద్దన్నారు. అలజడులు సృష్టిస్తే ఇబ్బందులు తప్పవన్నారు. పిల్లలను బాగా చదివించుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. పేకాట, మట్కా, అక్రమ మద్యంపై సమాచారం ఇవ్వాలన్నారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

సర్వే త్వరితగతిన పూర్తి చేయండి


సర్వే వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి

నల్లచెరువు: మండలం నుంచి హంద్రీనీవా కాలువ ద్వారా గాండ్లపెంట మండలానికి నీరందించే ఎత్తిపోతల పథకం పనులకు సంబంధించి సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి ఆదేశించారు. శనివారం సర్వే ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ నల్లచెరువు మండల పరిధిలోని హంద్రీ–నీవా కాలువ ద్వారా గాండ్లపెంట మండలంలోని రైతులకు నీరందించేందుకు జగనన్న ప్రభుత్వం ఇప్పటికే రూ. 44.4 కోట్లు విడుదల చేసిందన్నారు. సర్వే పనులను వారం రోజులుగా అధికారులు నిర్వహిస్తున్నారని తెలిపారు. మూడు, నాలుగు రోజుల్లో పూరి చేసి డీపీఆర్ సమర్పించాలని సూచించారు. త్వరలో పనులకు సంబంధించిన టెండర్లను పిలవనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రమణారెడ్డి, మండల కన్వీనర్ హైదర్‌వలి,వైస్ ఎంపీపీ నారాయణస్వామి, ఎంపీటీసీ మాధవిలత, మాజీ సొసైటీ అధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి, నాయకులు. కె. రమణారెడ్డి ఆడిటర్ దినేష్ రెడ్డి, సానే హరినాథ్‌రెడ్డి, రామిరెడ్డి, వనం శ్రీనివాస్‌రెడ్డి, తదితరులున్నారు.

నివాళి

తనకల్లు: మండల పరిధిలోని పరాకువాండ్లపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకురాలు హుస్సేనమ్మ శనివారం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి గ్రామానికి విచ్చేసి మృతదేహం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. హుస్సేనమ్మ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే వారని, ఆమె మృతి పార్టీకి తీరని లోటన్నారు. అంత్యక్రియలకు రూ. 10 వేలను ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ రామ్‌దేశాయ్ చేతుల మీదుగా అందజేయించారు. కార్యక్రమంలో నాయకుల బీఎస్ నిజాం, సమరసింహారెడ్డి, సాయిరెడ్డి,మస్తాన్, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


ఎమ్మెల్యే కేతిరెడ్డికి సమస్యలు విన్నవిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

ధర్మవరం అర్బన్: సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే కేతిరెడ్డికి ఉద్యోగులు విన్నవించారు. స్థానిక ఎమ్మెల్యే నివాసంలో శనివారం సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్ర శిక్ష పరిధిలో డేటా ఎంట్రీ ఆపరేటర్లు, మెసెంజర్లు, ఐఈఆర్‌పీలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, సీఆర్‌ఎంటీలు, కేజీబీవీ టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు, ఆయాలు, ఫిజియో థెరపిస్టులు, మండల లెవెల్ అకౌంటెంట్లు పనిచేస్తున్నామని తెలిపారు. వెంటనే కనీస వేతనం అమలు చేయాలని, ఉద్యోగులు మరణించినప్పుడు కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా కింద రూ.10 లక్షలు వెంటనే మంజూరు చేయాలన్నారు. చనిపోయిన ఉద్యోగి కుటుంబంలో ఒకరికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇవ్వాలన్నారు. 62 ఏళ్ల వయసు దాటిన అనంతరం కుటుంబానికి రూ. 10 లక్షల పరిహారం అందించాలని కోరారు.

వలంటీర్లకు వస్త్రాల పంపిణీ


వలంటీర్లకు నూతన వస్త్రాలు పంపిణీ చేస్తున్న షంషాద్‌బేగం, చాంద్‌బాషా


గొట్లూరు అనాథాశ్రమంలో దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న సరితాలబాష

ధర్మవరం: ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ షంషాద్‌బేగం, వార్డు ఇన్‌చార్జ్ చాంద్‌బాషాలు శనివారం కొత్తపేట 36వ వార్డు సచివాలయంలో వలంటీర్లకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే పుట్టినరోజును అందరూ పండుగలా జరుపుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ షంషాద్‌బేగం పిలుపునిచ్చారు. కేకు కట్ చేసి పంచిపెట్టారు

- మండలంలోని గొట్లూరు అనాథాశ్రమంలో 28వవార్డు వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ సరితాల బాష ఆధ్వర్యంలో శనివారం వృద్ధులు, అనాథలకు బట్టలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని దుప్పట్లు, బట్టలు, రూ.5 వేల నగదు అందించారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

నల్లమాడ/అమడగూరు: అమడగూరు మండలంలోని పూలకుంట పల్లి సచివాలయ పరిధిలోని గ్రామాల్లో ఆదివారం ఉదయం 7 గంటల నుంచి, నల్లమాడ మండలంలోని బొగ్గలపల్లి, బీ. రామాపురంలో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలియజేశాయి. ఎమ్మెల్యే గడప గడపకు వెళ్లి ఆయా కుటుంబాలకు అందిన సంక్షేమ పథకాలు, వాటి ద్వారా ఆ కుటుంబాలకు చేకూరిన లబ్ధిని తెలియజేస్తారన్నారు. ఏవైనా సమస్యలుంటే అధికారుల సమక్షంలో అక్కడికక్కడే పరిష్కారానికి చర్యలు తీసుకుంటారన్నారు.

నేడు సచివాలయం ప్రారంభోత్సవం

తలుపుల: మండలంలోని ఓబులరెడ్డిపల్లి గ్రామంలో నూతన సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ఆదివారం ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి ప్రారంభించనున్నారు. మండల వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొనాలని పార్టీ కన్వీనర్ పయాజ్ అహమ్మద్, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ రామకృష్ణారెడ్డి, సర్పంచ్ సుమియా, అగ్రిబోర్డు చైర్మన్ చెన్నక్రిష్ణారెడ్డి తెలిపారు.

రేపు చేపల చెరువుల వేలం

తలుపుల: లక్కసానిపెరువు, బొమ్మిరెడ్డికుంట,తుమ్మలకుంట చెరువుల్లో చేపలు పట్టే హక్కు కోసం సోమవారం ఉదయం 10 గంటలకు సచివాలయం వద్ద వేలం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ తులశమ్మ, కార్యదర్శి జాస్మిన్ ఓ ప్రకటనలో తెలిపారు. డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు


పూజలందుకున్న స్వామివారు

తాడిమర్రి: మండలంలోని ఏకపాదంపల్లి గ్రామంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి స్వామి మూలవిరాట్‌కు వెండి ఆభరణాలు తొడిగి, పూలమాలలతో అందంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామికి కొబ్బరి కాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

మాదిగ ఉద్యోగుల సమాఖ్య కమిటీ ఎన్నిక


పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

గాండ్లపెంట: మండల మాదిగ ఉద్యోగుల సమాఖ్య కమిటీని (ఎంఈఎస్) ఆ సంఘం జిల్లా నాయకులు ఆనంద్, నాగేంద్ర సమక్షంలో శనివారం ఎన్నుకొన్నారు. జంపాల వెంకటరమణను గౌరవ అధ్యక్షుడిగా, మండల కమిటీ అధ్యక్షుడిగా వి.రమేష్, ఉపాధ్యక్షుడిగా వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా మహేష్, కార్యదర్శిగా ప్రహ్లాదతో పాటు మరో నలుగురిని కమిటీ సభ్యులుగా, గౌరవ సలహాదారునిగా వై.శ్రీరాములును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ నవంబరు 7న తెలంగాణ రాష్ట్రంలో మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో జరిగే విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మహాసభ పోస్టర్లు విడుదల చేశారు.

గొర్రెల దొంగల ముఠా అరెస్ట్

నల్లచెరువు: గొర్రెలను అపహరించుకెళుతున్న ముఠా సభ్యులను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను శనివారం నల్లచెరువు పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ లింగన్న వెల్లడించారు. మండలంలోని నీలవాండ్లపల్లిలో గత నెల 21న గొర్రెల కాపరులు ఫక్కీరప్ప, గోవిందమ్మను దుండగులు తీవ్రంగా గాయపరచి జీవాలను ఎత్తుకెళ్లిన విషయం తెలిసిందే. ఈ కేసు దర్యాప్తును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలీసులు శుకవారం రాత్రి తనకల్లు మండలం పరాకులువాండ్లపల్లి వద్ద అనుమానాస్పదంగా తచ్చాడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో గత నెల 21న గొర్రెల అపహరించుకెళ్లిన విషయాన్ని అంగీకరించారు. నిందితులను అన్నమయ్య జిల్లా బి.కొత్తకోటకు చెందిన కంప శ్రీనివాసులు, అనిగాని సిద్ధేష్, తనకల్లు గ్రామానికి చెందిన కత్తి వెంకటేష్, కత్తి బయన్నగా గుర్తించి, వారి నుంచి రూ.2 లక్షలు విలువ చేసే 25 గొర్రెలను స్వాధీనం చేసుకున్నారు. చెడు వ్యసనాలకు బానిసలుగా మారిన వారు తమ జల్సాల కోసం గొర్రెలను అపహరించుకెళుతున్నట్లుగా అంగీకరించారు. నిందితులపై కేసు నమోదు చేసి, శనివారం న్యాయస్థానంలో హాజరుపరిచారు.

వ్యవసాయ కార్మిక సంఘం మహాసభ


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య

నల్లమాడ: స్థానిక వ్యవసాయ కార్మిక సంఘం మండల మహాసభను శనివారం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో నిర్వహించారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన మహాసభలో సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మల్లెల గంగాధర్ హాజరై ప్రసంగించారు. వారు మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘం మున్ముందు ప్రజా సమస్యలపై పోరాటం సాగిస్తుందన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శిగా మగ్గం చంద్ర, సహాయ కార్యదర్శులుగా రామప్ప, సులోచనతో పాటు మొత్తం 13 సభ్యులతో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు అనంతరం సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు.

జాగిలాల పరిశీలన


ఎస్పీ మాధవరెడ్డికి సెల్యూట్ చేస్తున్న జాగిలాలు

పుట్టపర్తి టౌన్: పేలుడు పదార్థాలను పసికట్టడంలో తర్ఫీదు పొందిన జాగిలాలను శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ మాధవరెడ్డి పరిశీలించారు. తార, విక్రమ్ అనే పేర్లు కలిగిన జాగిలాలను జిల్లాకు కేటాయించడంతో పోలీసు కార్యాలయానికి తీసుకొచ్చారు. సిబ్బంది సుధాకర్, హరిలు ఎస్పీకి తర్ఫీదు గురించి వివరించారు. సరైన వసతి సౌకర్యాలను కల్పించి ఆరోగ్యంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఎస్పీ మాధవరెడ్డి వారిని ఆదేశించారు.

కర్ణాటక మద్యం పట్టివేత


స్వాధీనం చేసుకున్న మద్యం ప్యాకెట్లతో పోలీసులు

ఓడీ చెరువు: అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. మహమ్మదాబాద్ క్రాస్ వద్ద శనివారం ఉదయం నాలుగు పెట్టెల్లోని 90 ఎంఎల్ టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని పట్టుకొని ఎద్దులవారిపల్లి తాండాకు చెందిన శంకర్‌నాయక్ అనే వ్యక్తిని అరెస్ట్ చేశామన్నారు. ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ కిశోర్‌కుమార్ రెడ్డి, కానిస్టేబుళ్లు నరేష్, లోకేష్, అంజి పాల్గొన్నారు.

సిమ్మింగ్ పోటీల్లో సత్తా


విద్యార్థితో ఉపాధ్యాయులు

పుట్టపర్తి టౌన్: ఉమ్మడి అనంతపురం జిల్లాలో జరిగిన స్విమ్మింగ్ పోటీల్లో బుక్కపట్నం బాలుర ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి సాయితేజ సత్తా చాటాడు. 50 మీటర్ల ఫ్రీ స్టయిల్ విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు జగదీష్ పేర్కొన్నారు. అక్టోబర్‌లో తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు. ఈ విషయంపై పీడీ నాగరాజు, పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.